

బాగేపల్లిలో భారీ వర్షం

బాగేపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): బాగేపల్లిలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. తాలూకా వ్యాప్తంగా ఒక మోస్తరు వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి.



జలమయమైన రహదారి



విధానసౌధలో మీడియాతో సీఎం సిద్దరామయ్య

పైసా కూడా రాలేదు..!

- ప్రకటనలకే పరిమితమైన కేంద్రం
- భద్ర ఎగువ ప్రాజెక్టు గ్రాంట్లపై నిర్లక్ష్యం
- కేంద్ర ఆర్థికమంత్రిపై సీఎం ఆగ్రహం

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం భద్ర ఎగువ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.5,360 కోట్లు ప్రకటించిందని, ఏడాది ముగిసినా పైసా కూడా విడుదల చేయలేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. బుధవారం విధానసౌధ సభాప్రాంగణంలో రాష్ట్రస్థాయి దిశా సమితి సభలో ఆయన మాట్లాడారు. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో భద్ర ఎగువ ప్రాజెక్టుకు రూ.5,360 కోట్లు కేటాయించారని ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌లో 5,495 కోట్ల రూపాయల స్పెషల్ గ్రాంట్ ఇవ్వాలని, చెరువులు, పెరిఫెరల్ రోడ్లకు రూ.11,495 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రం నుంచి 4.5 లక్షల కోట్ల రూపాయలు కేంద్రానికి ఏటా పన్నుల రూపంలో వెళ్తున్నా కనీ సమైన సాయం అందడం లేదన్నారు. రెండుసార్లు కేంద్ర ఆర్థికమంత్రిని కలసి వినతి పత్రం ఇచ్చినా వృథాగా మారిందన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు గ్రాంట్లకోసం ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రాజెక్టులకు కేంద్రంనుంచి గ్రాంట్లు రావడం లేదని విచారం వ్యక్తం చేశారు.



ఇక గ్రేటర్..!

- నేటితో బీబీఎంపీకి గుడ్‌బై
- వెయ్యి చదరపు కిలోమీటర్లకు పెరగనున్న పరిధి
- 3 నెలల్లో సీఎం అధ్యక్షతన ప్రాధికార ఏర్పాటు

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి బృహత్ బెంగళూరు మహానగర పాలికెగా కొనసాగిన బీబీఎంపీకి గుడ్‌బై చెప్పనున్నారు. ప్రభుత్వం బుధవారం గెజిట్‌ను ప్రకటించింది. సాయంత్రం దాకా బీబీఎంపీగా పిలవబడుతున్నా తెల్లారేసరికి అది కాస్త గ్రేటర్ బెంగళూరు ప్రాధికారగా మారిపోనుంది. బీబీఎంపీ పాలనాధికారులే గ్రేటర్ బెంగళూరుకు చీఫ్ కమిషనర్‌గా నియమింపబడనున్నారు. ప్రస్తుతం బీబీఎంపీలో ఉన్న 225 వార్డుల పరిధినే గ్రేటర్ బెంగళూరుగా ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో గ్రేటర్ బెంగళూరు పాలనా చట్టం 2024 అమలులోకి రానుంది. కొత్త వ్యవస్థ పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చేవరకు ప్రస్తుత పాలికె ప్రదేశంలోనే కార్యనిర్వహణ కొనసాగనుంది. గ్రేటర్ బెంగళూరు చట్టం ప్రకారం కొత్త పాలికెల ఏర్పాటు, నిబంధనలు అనుబంధాలతో కలిపి ఇతర కార్యకలాపాలకు అవకాశం లభించనుంది. ఈ నిబంధనల ఆధారంగా పాలనాధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలతో కొత్త కమిటీలను, నూతన పాలికెలను ఏర్పాటు చేసి త్వరలోనే ప్రత్యేకమైన పాలసీలను విడుదల చేయనున్నారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార చట్టం అమలులోకి వచ్చిన 120 రోజుల్లో ముఖ్యమంత్రి అధ్యక్షతన గ్రేటర్ బెంగళూరు ప్రాధికార ఏర్పడాల్సి ఉంది. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పరిధిలో 150 వార్డులకు మించకుండా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం అస్తిత్వంలో ఉండే బీబీఎంపీ పరిధిని విస్తరింపచేసుకునేందుకు అవకాశం ఉంది. 709 చదరపు కిలోమీటర్ల నుంచి వెయ్యి చదరపు కిలోమీటర్లకు విస్తరింపచేయనున్నారు. బీబీఎంపీకి అనుబంధంగా ఉండే బెంగళూరు నగర జిల్లా ప్రదేశం గ్రేటర్ బెంగళూరు పరిధిలోకి విలీనం చేసుకుని 3-5 పాలికెలను రూపొందించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. పాలికెల సంఖ్యపై త్వరలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

గ్రేటర్ బెంగళూరు రూపు దిద్దుకుందిలా..

బీబీఎంపీ విభజనకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం 2014 సెప్టెంబరు 22న మాజీ చీఫ్ సెక్రటరీ బీఎస్ పాటిల్ నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చాక 2023లో నిపుణుల కమిటీని పునరుద్ధరించింది. దీన్ని బ్రాండ్ బెంగళూరు సమితిగా నామకరణం చేసింది. గ్రేటర్ బెంగళూరు పాలక బిల్లు 2024కు 2024 జూలై 22న మంత్రివర్గం ఆమోదించింది. జులై 23న శాసనసభలో సమర్పించారు. 25న ప్రతిపక్షాల డిమాండ్‌తో బిల్లు పరిశీలనకోసం జాయింట్ యాక్షన్ కమిటీకి అప్పగించారు. ఆగస్టు 22న ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ నేతృత్వంలో శాసనసభా సంయుక్త కమిటీ ఏర్పాటు చేశారు. 2025 ఫిబ్రవరి 21న జాయింట్ పరిశీలనా కమిటీచే స్పీకర్‌కు నివేదిక సమర్పించారు. మార్చి 5న పరిశీలనా సమితి సిఫారసుతో గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లును శాసనసభలో సమర్పించారు. మార్చి 10న బిల్లును అంగీకరించారు. విధాన పరిషత్‌లో మార్చి 12న బిల్లుకు ఆమోదం దక్కింది. గవర్నర్ ఆమోదం కోసం మార్చి 17న రాజ్‌భవన్‌కు పంపారు. అయితే మార్చి 25న పలు స్పష్టీకరణ కోరుతూ గవర్నర్ బిల్లును వాపసు పంపారు. చివరకు ఏప్రిల్ 24న గ్రేటర్ బెంగళూరు బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. 2025 మే 15నుంచి గ్రేటర్ బెంగళూరు అస్తిత్వంలోకి రానుంది.



బీబీఎంపీ కేంద్ర కార్యాలయం

మూడంచెల పాలనా వ్యవస్థ

గ్రేటర్ బెంగళూరు చట్టం ప్రకారం మూడంచెల పాలనా వ్యవస్థ అమలులోకి రానుంది. తొలి అంచెలో నగరానికి సంబంధించి అన్ని ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలతో సమ్మైక్యం కానున్నాయి. రెండో అంచెలో పాలికెలు ఏర్పడి కార్యనిర్వహణ జరపనున్నాయి. మూడో అంచెలో ప్రతి పాలికెకు వార్డుస్థాయి సమితి ఏర్పాటు చేయనున్నారు. ఇలా మూడు అంచెలతో ప్రభుత్వం పర్యవేక్షించనుంది. పలు శాఖల విభాగాల్లో కీలక మార్పులు తెచ్చి పాలన మరింత సమర్థవతంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలుస్తోంది.

మన మిస్సైల్స్‌తో కాంగ్రెస్ వారికే అధిక బాధలు..!

- పాకిస్థాన్ కంటే ఎక్కువ బాధపడుతున్నారు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఎద్దేవా



బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడి ప్రతీకారానికి భారతసైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరిట ప్రయోగించిన మిస్సైల్స్ పాకిస్థాన్ వాసులకంటే కాంగ్రెస్ నాయకులకే ఎక్కువ బాధ కలిగినట్లు అనిపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర వ్యంగ్యం చేశారు. బుధవారం ఎక్స్‌లో విజయేంద్ర ఘాటుగా స్పందించారు. రెండుమూడు రోజులుగా కొందరు కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు పరిశీలిస్తే పాకిస్థాన్ మిలిటరీ అధికారిక సమాచారాన్ని తలపిస్తున్నాయన్నారు. సీఎం సిద్దరామయ్య ఇండియన్ మిలిటరీ చర్యలను వ్యతిరేకించి పాకిస్థాన్ ప్రశంసలు పొందారన్నారు. ఓ కాంగ్రెస్ నేత పాకిస్థాన్ బీజేపీకి వ్యతిరేకమని, తమకు కాదని వ్యతిరేకిస్తారన్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఎంతోమంది ఉగ్రవాదులు అంతర్జాతీయస్థాయిలో నేరస్తులుగా ముద్రపడినవారని, ముంబైతోపాటు పలు దాడులకు కారకులన్నారు. కాగా ప్రతిపక్షనేత అశోక్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి ప్రియాం ఖర్గే నేరుగా ఇందిరాగాంధీకి ఉత్తరాధికారి తరహాలో మాట్లాడుతున్నారన్నారు. జాతీయకాంగ్రెస్ బాధ్యతలను జూనియర్ ఖర్గేకు కాంట్రాక్టు ఇచ్చారా..? అంటూ ప్రశ్నించారు. ఆయన సొంత జిల్లా కలబురగిలో ఇటీవల ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో అత్యంత తక్కువశాతం ఉత్తీర్ణత సాధించారనేది తెలుసుకుంటే బాగుంటుందన్నారు. మీ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఎందుకో రాహుల్‌గాంధీని వదిలి ఇందిరాగాంధీని పొగుడుతున్నారన్నారు. మీ తండ్రి మల్లికార్జున ఖర్గే 50ఏళ్ల కాంగ్రెస్‌లో పనిచేసినా ముఖ్యమంత్రి కాలేదని, కానీ ఇందిరా గాంధీకి ఉత్తరాధికారి కావాలనే కలలు సాధ్యమా..? అన్నారు. పాకిస్థాన్ దేశస్తులు మీడియాతో మాట్లాడినవేళ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్యలు మాట్లాడిన వీడియోలను వాడుతున్నారని, ఇది దేనికి సంకేతమన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయనగరం ఇన్‌చార్జిమంత్రి జమీర్‌ఖాన్

రెండేళ్ల పాలనా సంబరాలు..

- 20న హోస్పేటలో భారీ సమావేశానికి సిద్ధం
- జర్మనీ టెంట్ తరహాలో ప్రత్యేక వేదిక
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి జమీర్ ఖాన్

బళ్లారి సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా భారీ సంబరాలకు సిద్ధమయ్యింది. విజయనగరం జిల్లా హోస్పేటలక్ష ఈనెల 20న పునీత్ రాజ్‌కుమార్ జిల్లాస్టేడియంలో వేడుకలు ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టనున్నారు. బుధవారం జిల్లా ఇన్‌చార్జిమంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ స్టేడియంను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. దేశంలో రెండవ ఎత్తైన జెండా స్తంభం(405 అడుగులు) ఈమైదానం మధ్యలో ఉంది. 19 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానంలో గరిష్టంగా రెండు లక్షల మంది కూర్చునే అవకాశం ఉంది. జర్మనీ టెంట్ తరహాలో ఒక పెవిలియన్ నిర్మిస్తున్నారు. కనీసం లక్ష మంది సమావేశంలో పాల్గొంటారని అంచనా. అందరూ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లాపరిపాలనా వర్గాలు పేర్కొన్నారుయి. గతంలో ఇందిరాగాంధి మున్సిపల్ మైదానంలోని కట్టపై నిల్చుని ప్రసంగించారు. ఆ కట్ట ఇప్పటికీ అదే ప్రదేశంలో ఉంది. ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. దానిని పునరుద్దరించడానికి, ఆకట్టపై ఇందిరా గాంధీ విగ్రహాన్ని నిర్మించడానికి ఒక అత్యవసర ప్రణాళికను రూపొందించారు. మే 20న రాహుల్ గాంధీ స్వయంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

సర్కార్ ఆధీనంలోనే 108 సేవలు

- ఇబ్బందులు అధిగమించడానికి ప్రభుత్వ నిర్ణయం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావు



మీడియాతో మంత్రి దినేశ్ గుండూరావు

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఏజెన్సీల పర్యవేక్షణలో ఉన్న 108 అంబులెన్స్ సేవలను ఇకపై ప్రభుత్వమే నిర్వహిస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు తెలిపారు. నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఎన్నో ఏళ్లుగా అత్యవసర వైద్యసేవలు ప్రైవేట్ ఏజెన్సీలు పర్యవేక్షిస్తున్నాయన్నారు. పలు సమస్యలు ఉన్నాయన్నారు. వాటన్నింటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చామరాజనగర జిల్లాలో ప్రయోగాత్మకంగా జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తోందన్నారు. అదే మోడల్‌తో రాష్ట్రమంతటా విస్తరింపచేసే ఆలోచన ఉందన్నారు.

రేపు హోస్పేటకు సీఎం రాక

బళ్లారి, మే 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య శుక్రవారం విజయనగర జిల్లా హోస్పేట్‌లో పర్యటిస్తున్నట్లు సీఎంవో కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం ఈనెల 16న బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో 10 గంటలకు బయలు దేరి తోరణగల్లు జిందాల్ ఎయిర్ పోర్టుకు 10.50 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో విజయనగర జిల్లా హోస్పేట్‌కు బయలు దేరుతారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించిన వాటిపై వివరించేందుకు భారీ సభను ఏర్పాటు చేస్తున్నారు. సభా ఏర్పాట్లను ముఖ్యమంత్రి పర్యవేక్షించనున్నారు. హోస్పేట్ నుంచి 1గంట 30 నిమిషాలకు బయలుదేరి జిందాల్ ఎయిర్ పోర్టుకు 2 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి దక్షిణ కన్నడ జిల్లాకు బయలు దేరుతున్నట్లు సీఎం కార్యదర్శి చిరంజీవి తెలిపారు.

నేడు మంత్రి శివరాజ్ తంగడగి

రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ, కన్నడ, సంస్కృతి శాఖ మంత్రి శివరాజ్ తంగడగి గురువారం బళ్లారి జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచార శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కరటగి నుంచి బళ్లారి జిల్లా సండూరు కు చేరుకుని సండూరు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల అధికార కాలం పూర్తయిన సందర్భంగా హోస్పేటలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు.



బోల్తా పడిన మినీ బస్సు

మినీ బస్సు బోల్తా

- వృద్ధురాలి మృతి
- 15 మంది కర్ణాటక వాసులకు గాయాలు
- శ్రీకాళహస్తి వద్ద ప్రమాదం

శ్రీకాళహస్తి మే 14(ఆంధ్రజ్యోతి): మినీబస్సు బోల్తా పడిన ఘటనలో సుమారు 15 మంది గాయపడ్డారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి అండర్‌పాస్ వంతెనపై బుధవారం ఉదయం జరిగింది. బెంగళూరుకు చెందిన 20 మంది భక్తులు తిరుపతికి విచ్చేసి ఓ ప్రైవేటు లాడ్జీలో బస చేశారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుపతి లాడ్జీ నిర్వాహకుల ద్వారా ఓ ప్రైవేటు మినీ బస్సుతో టూర్ ప్యాకేజిని ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా 20మంది బుధవారం ఉదయం శ్రీకాళహస్తికి బయలుదేరారు. మార్గమధ్యంలోని రాచగున్నేరి వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సుమారు 15మంది గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇందులో రేష్మశెట్టి, రవిశెట్టి, వేణుగోపాల్, మంజుల, సృజల, గార్వి, ఊసప్ప, మధుబాబు, మృద్విశెట్టి, విహన్, పురవ్ సహా మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొందరిని తిరుపతికి రుయాకు తరలించారు. ఇందులో కొండమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు.



చికిత్స పొందుతున్న బాధితుడు



గ్రామంలోని మఠం ప్రాథమిక పాఠశాల

ఊరంతా సైన్యం..!

- ఆ పల్లె నిండా జవానులే..
- బ్రిగేడియర్ నుంచి కల్నల్ దాకా
- 250 మందికి పైగా దేశ సేవలో..

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): సైనికులంటే అందరికీ గౌరవం. భావోద్వేగం, ఆవేశం, ఆలోచన వచ్చినప్పుడు ప్రతి ఒక్కరికీ సైన్యంలో పనిచేస్తే బాగుంటుందనే జీవితంలో ఒక్కసారైనా మనస్సులో కలుగుతుంది. అంతటి గొప్ప శక్తి సైనికుడికి మాత్రమే ఉంటుంది. పది పల్లెల్లో వెతికితే ఒకరిద్దరు సైనికులు మాత్రమే ఉంటారు. అటువంటిది ఓ గ్రామంలో ఏకంగా 250మందికిపైగా సైనికులు ఉండడం ప్రత్యేకం. ఆ గ్రామంలో నిత్యం క్రమశిక్షణ, సైనికుల రాకపోకలు సాగుతుంటాయి. ప్రతి ఇంట్లోనూ సైనికుడి గౌరవం కనిపిస్తుంది. అదే బెళగావి జిల్లా సవదత్తి తాలూకాలోని ఇంచల గ్రామం. శివయోగీశ్వర సాధు సంస్థాన మఠం కల్గిన గ్రామంగా పేరొందింది. ఇక్కడ మఠాధిపతి శివానంద భారతిస్వామీజీ దూరదృష్టితో గ్రామంలో విద్యాక్రాంతి తీసుకొచ్చారు. ప్రాథమిక నుంచి డిగ్రీ, డీఎడ్, బీఏఎంఎస్ కళాశాలను తీసుకురావడమే భారీ మార్పునకు కారణమైంది.

స్థానికంగా విద్యాసంస్థలు అందుబాటులో ఉండడంతో ఇంచల వాసులే కాకుండా సమీపంలోని పది గ్రామాల విద్యార్థులు ఇక్కడ ఉన్నత విద్యదాకా చదువుతున్నారు. ఈగ్రామానికి రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. గ్రామంలో దాదాపు ఇంటింటా ఉపాధ్యాయుడు ఉంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేయిస్తున్నారు. తద్వారా అత్యధిక మంది ఉపాధ్యాయులు కల్గిన గ్రామంగా కూడా ఇంచల పేరొందింది. 1988 నుంచి ప్రతి ఉపాధ్యాయుల పోటీ పరీక్షల్లో కనీసం 20మంది గ్రామస్థులు ఎంపిక అవుతారు. డీఎడ్ కళాశాల ఉన్నందున అనుకూలంగా ఉంది. 1997లో కరిగార ఇంటిపేరు కల్గినవారు ఏడుగురు ఎంపిక కాగా అదే ఏడాది గ్రామానికి చెందినవారు 50మంది ఉపాధ్యాయులుగా నియమించబడ్డారు. ఇప్పటివరకు ఇక్కడి డీఎడ్ కళాశాలలో 7వేలమంది శిక్షణ పొందగా దాదాపు 99శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఉన్నారు. అదే తరహాలోనే ఇక్కడ ప్రతి ఇంటా సైనికుడు కూడా ఉన్నాడు. దేశసేవకోసం ఈ గ్రామానికి చెందినవారు దశాబ్దాలకాలంగా పనిచేస్తున్నారు.

ముగ్గురితో మొదలై..

మాజీ సైనికుడు బసవణ్ణప్ప జకాతి అభిప్రాయం మేరకు తొలుత ఇంచల నుంచి ముగ్గురు సైన్యంలో చేరారన్నారు. వారు సెలవులకు వచ్చినప్పుడు ధరించే యూనిఫాం, క్రమశిక్షణ, దేశభక్తి మాటలకు ప్రేరేపితులై సైన్యంలో చేరినట్లు తెలిపారు. ఆ తర్వాత నిరంతరంగా మిలిటరీ క్యాంప్‌లు ఎక్కడ జరిగినా తమ గ్రామస్థులు ఎంపికవుతున్నారన్నారు. మరో మాజీ సైనికుడు రుద్రప్ప బాగేవాడి అభిప్రాయం మేరకు ఇంచల గ్రామంలో మార్పుకు శివానంద భారతిస్వామీజీ కారణమన్నారు. కర్ణాటకలో ఒక గ్రామంలో అత్యధికమంది ఉపాధ్యాయులు, సైనికులుండడం తమ ప్రత్యేకమన్నారు. 27ఏళ్లపాటు సైన్యంలో పనిచేసి రిటైర్డు అయ్యానని, గ్రామ యువతకు సైన్యంలో చేరేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

విధుల్లో 250 మంది - 90కి పైగా రిటైర్డ్..

ఇంచల గ్రామంలో గుణాత్మకమైన విద్యతోపాటు వ్యాయా మ క్రీడలకు అనుగుణంగా మైదానాలు, శిక్షణలకు అనుకూలంగా ఉంది. ఇలా ఇక్కడ యువత సైన్యంలో చేరేందుకు స్థానిక విద్యాసంస్థలు ఎంతో సహకారం అందిస్తున్నాయి. ప్రస్తుతం మిలిటరీ, ఎయిర్‌ఫోర్స్, నావికారంగం, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీలలో గ్రామానికి చెందిన సైనికులు ఉన్నారు. గ్రామస్థులు తెలిపిన మేరకు 250మందికిపైగా వివిధ విభాగాలలో సైనికులు ఉన్నారు. సుమారు 90మంది రిటైర్డు అయ్యారు. గ్రామానికి చెందిన యల్లణగౌడ మల్లార బ్రిగేడియర్‌గా కొనసాగుతుండగా సిద్దరామ జంబగి లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్నారు. సైన్యంలో వివిధ హోదాలలో ఉండే వారు ఇక్కడ ఉన్నారు.

2006లో శివయోగీశ్వర మాజీ సైనికుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. సైన్యంలో ఎందుకు చేరాలి, సైన్యంలో చేరేందుకు ఎటువంటి శిక్షణ అవసరం, అక్కడ ఎలా విధులు నిర్వహించాలనేది మాజీ సైనికులు అవగాహన కల్పిస్తారు. శిక్షణ పొందేవారికి రోజూ ప్రత్యేక తరగతులను మాజీ సైనికులు నిర్వహిస్తారు. ప్రతిరోజూ యువతతోపాటు మాజీ సైనికులు తెల్లవారుజామునే రన్నింగ్, ఇతర క్రీడల్లో పాల్గొంటుంటారు. సెలవులపై వచ్చే సైనికులు వీరితో కలసి సైన్యంలో వారి అనుభవాలను పంచుకుంటుంటారు. ఇలా ఏటా కనీసం పదిమంది సైన్యంలో చేరుతున్నారు.

మాజీ సైనికుడు సంగనాయక అభిప్రాయం మేరకు బాగేవాడి కుటుంబంలో మాజీ, ప్రస్తుతం పనిచేసేవారితో కలిపి 15మంది సైనికులు ఉన్నారన్నారు. మల్లార కుటుంబంలో 9మంది, దిన్నమని, భాగనవర, పట్టణశెట్టి, గాణిగేరి కుటుంబాలలో ఐదుగురు చొప్పున ఉన్నారన్నారు. ఇలా రాష్ట్రంలో అత్యధిక మంది సైనికులతో గ్రామం విశేష ఖ్యాతి గడించింది.



మాట్లాడుతున్న మాజీ సైనికులు



ఇంచల గ్రామం

ఇదేమి విచారణ..?

● వైసీపీ హయాంలో అంగన్‌వాడీలకు చేరని కోడిగుడ్లు ●31.48 లక్షల గుడ్ల పంపిణీలో గోల్‌మాల్ ● అక్రమాలపై అప్పటి ఆర్డీవో నివేదిక ● ఇద్దరు సీడీపీవోలపై ఆరోపణలు ● వారి సమక్షంలోనే విచారణ ● ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది తీరుపై విమర్శలు


అంగన్‌వాడీ కార్యకర్తలతో విచారణ చేపట్టిన కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది

కళ్యాణదుర్గం, మే 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసిన కోడిగుడ్లను మింగేయడంపై విచారణ చేపట్టారు. 2020 సంవత్సరం కరోనా సమయంలో కోడిగుడ్ల పంపిణీలో గోల్‌మాల్ జరిగినట్లు అప్పట్లో పనిచేసిన కళ్యాణదుర్గం ఆర్డీవో నిషాంత్‌రెడ్డి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఈ నేపథ్యంలో బుధవారం కంబదూరు ఐసీడీయస్ ప్రాజెక్టును కర్నూలు ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ మంజులవాణి, సీనియర్ అసిస్టెంట్ షెక్షావలి సందర్శించి అక్కడ పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను విచారణ చేపట్టారు. అప్పట్లో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో 31,48,805 కోడిగుడ్లు పంపిణీ చేశారు. కానీ అవి కేంద్రాలకు చేరలేదని తెలుస్తోంది. అప్పట్లో ఓ సచివాలయ మహిళా పోలీస్ అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లినప్పుడు కోడిగుడ్లు ఇవ్వలేదని చెప్పడంతో, ఆమె వెంటనే కళ్యాణదుర్గం ఆర్డీవో నిషాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన పూర్తి స్థాయిలో విచారించిన తర్వాత బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు మండలాల్లో ఉన్న 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్ల పంపిణీలో తేడాలున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్‌లో నమోదుకు, అంగన్‌వాడీ కార్యకర్తల రిజిస్టర్ నమోదులో తేడాలున్నట్లు విచారణలో తేలింది. ఆయన నివేదిక ఆధారంగానే ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది విచారణ చేపట్టారు.

విచారణపై అనుమానాలు

ఆరోపణలు ఎదుర్కొంటున్న సీడీపీఓల సమక్షంలోనే విచారణ చేపట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. 200 మంది అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో రాయించుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐదు ప్రశ్నలకు ఒక్కొక్క కార్యకర్త నుంచి సమాధానాలు రాయించుకున్నారు. అప్పట్లో పనిచేసిన సీడీపీవోలు వరలక్ష్మి, వనజా అక్కమ్మ.. మీ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారా.. లేదా, కోడిగుడ్లు ఇచ్చారా.. లేదా, ఎన్నిసార్లు మీ కేంద్రాలను తనిఖీ చేశారు.. ఇలా ప్రశ్నలు ఇచ్చి సమాధానాలు రాయించుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాల్సిన అధికారులు.. కార్యాలయానికి పిలిపించుకుని సమాధానాన్ని రాయించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ఎదుటే ఆర్జేడీ కార్యాలయ అధికారులు విచారణ చేపట్టడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. లక్షల్లో కోడిగుడ్లను మాయం చేయగా.. వందల్లోనే గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించామని అధికారులు తేలికగా కొట్టిపారేస్తున్నారు. కోడిగుడ్లు ఒక్కటే కాదు పౌష్టికాహారమూ పక్కదారి పట్టించారన్న విమర్శలున్నాయి.




కొత్త యాప్‌తో ఉపాధి కూలీలకు అవస్థలు

● సర్వర్ సతాయింపుతో హాజరు అప్‌లోడ్‌కు కష్టాలు ● ప్రతిరోజూ రాత్రి 10 తర్వాతే అటెండెన్స్ ● హాజరు నమోదుకాకపోతే ఆరోజు కూలి అంతే ● సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్న కూలీలు


రాప్తాడు మండలంలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

యాప్‌సోపాలు

శింగనమల/రాప్తాడు, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో ప్రవేశపెడుతున్న నూతన విధానాలు కూలీలకు శాపంగా మారుతున్నాయి. కూలీల హాజరు వివరాలు ఏ రోజుకు ఆ రోజులోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి సర్వర్ సతాయిస్తుండటంతో ఈ దుస్థితి నెలకొంది. ఉపాధి పనికి వెళ్లిన కూలీల హాజరు వివరాలు, ఫొటో ఆ రోజు అర్ధ రాత్రి లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోతే పనులకు వెళ్లిన కూలీలకు ఆ రోజు కూలి ఖాతాలో జమ కాదు. కూలీల హాజరు వివరాలు, ఫొటో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ప్రతి రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సర్వర్ మొరాయిస్తుండటంతో కూలీలు పనులకు హాజరైనా ఒక్కో సారి వారి హాజరు వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాక కూలి అందడం లేదు. శింగనమల మండలంలోని 19 పంచాయతీల్లో 5వేల మందికి పైగా ఉపాధి పనులకు వెళుతున్నారు. అలాగే రాప్తాడు మండలంలో మొత్తం 12వేలకు పైగా జాబ్ కార్డులు ఉండగా 9 వేల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. మండల వ్యాప్తంగా ప్రస్తుతం 4 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు.



కూలీల ఆన్‌లైన్ అటెండెన్స్ అప్‌లోడ్‌కు మెరాయిస్తున్న సర్వర్

ఎన్ఎంఎంఎస్ యాప్‌తో తిప్పలు

ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో ప్రతి రోజూ కూలీల హాజరు వివరాలు, కూలీలు పని చేస్తున్న ఫొటో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రతి రోజూ ఉదయం కూలీలు పనులకు వెళ్లిన తరువాత ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశం వద్దకు వెళ్లి ఉదయం 10 గంటలలోపు కూలీలు పని చేస్తున్న ఫొటో తీయాలి. ఆ ఫొటోలో ఎంత మంది కూలీలు పని చేస్తున్నారో కనిపించేలా ఉండాలి. ఆ ఫొటోను, ఆ రోజు పనులకు హాజరైన కూలీల హాజరును అర్ధ రాత్రి 12 గంటలలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. లేదంటే ఆ రోజు కూలీలకు దిన కూలీ జమ కాదు. ఉదయం నుంచి కూలీల హాజరు అప్‌లోడ్ చేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రయత్నించినా అనేక సార్లు సర్వర్ సమస్య వలన కావడం లేదు. చాలా సార్లు రాత్రి 10 గంటల నుంచి 12 గంటల లోపు కూలీల హాజరు, ఫొటో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోందని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. కూలీల హాజరు వివరాలు అప్‌లోడ్ చేయకపోతే కూలీలకు చేసిన పనికి కూలి జమ కాదని, అలా జరిగితే కూలీలు ఉపాధి సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారని వాపోతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సమస్య ఉంది

కూలీల హాజరు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు అనేక సార్లు సర్వర్ సమస్య వస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కూలీల హాజరు, పని చేసే ఫొటో అప్‌లోడ్ చేసేందుకు అనేక సార్లు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపాం. రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉంది. త్వరలోనే పరిష్కారం అవుతుంది.

-సావిత్రి, ఏపీఓ, రాప్తాడు

రోజూ ఇబ్బందే

ఉపాధి పనులు వద్ద ఉదయం 7 గంటల నుంచి హాజరు యాప్ లో కూలీల వివరాలు నమోదు చేయడానికి ప్రతి రోజూ ఇబ్బంది తప్పడం లేదు.



అప్డేట్ చేయడానికి ఉదయం పూట [illegible] రాకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. సర్వర్ సక్రమంగా వస్తే హాజరు నమోదుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అధికారులు సర్వర్ సమస్యను తీర్చాలి.

-దివాకర్, ఉపాధికూలీ, శింగనమల

ఈవారం సమస్యలేదు

పనులకు వెళ్లిన కూలీల వివరాలు తప్పనిసరిగా హాజరు యాప్‌లో నమోదు చేసి అప్డేట్ చేయాలి. ఈమేరకు అవగాహన కల్పించాం. అయితే గత వారం సర్వర్ సమస్యతో రాత్రి సమయంలోనే యాప్ అప్డేట్ అయింది. సోమవారం నుంచి పనులు వద్దనే సర్వర్ రావడంతో అప్డేట్‌ను కూలీలు నమోదు చేస్తున్నారు.

-తలారి దామోదర్, ఇన్‌చార్జ్ ఏపీఓ

కవర్ కాని షెడ్..!

చీనీ మార్కెట్‌లో ఆగిన కవర్ షెడ్ నిర్మాణం
ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని వైనం
మండుటెండలోనే చీనీకాయల నిల్వ
కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడమే కారణం

అనంతపురం రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): చీనీ మార్కెట్‌లో కవర్ షెడ్ నిర్మాణం మళ్లీ ఆగిపోయింది. నెలల్లో పూర్తి కావాల్సింది, ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే ఉండిపోయింది. కాంట్రాక్టర్‌కు బిల్లుల మంజూరులో జరుగుతున్న జాప్యమే ఇందుకు ప్రధాన కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. షెడ్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు, వ్యాపారులు మార్కెట్‌కు వచ్చే చీనీ దిగుబడులను మండుటెండలో ఉంచుతున్నారు.

వైసీపీ హయాంలో నిర్మాణ చర్యలు..

యార్డులోని చీనీ మార్కెట్‌కు రోజు రోజుకు చీనీ దిగుబడులు ఎక్కువగా వస్తుండటంతో ఆదాయం కూడా బాగానే సమకూరుతోంది. ఈక్రమంలో మరో షెడ్ నిర్మాణం చేపట్టాని నిర్ణయించారు. ఆమేరకు వైసీపీ ప్రభుత్వంలో కవర్ షెడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తొలత రూ.2.10కోట్లతో నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఆమేరకు టెండర్లు పిలిచి తిరుమల కన్‌స్ట్రక్షన్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. అప్పటి ప్రజాప్రతినిధులు, పాలక వర్గసభ్యులు నిర్మాణాన్ని ప్రారంభించారు. అప్పట్లోనే చీనీ సీజన్ ప్రారంభంలోపు షెడ్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి పనులు ప్రారంభించారు. ఇదంతా జరిగి ఇప్పటికి మూడేళ్లు కావస్తోంది. షెడ్ నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ప్రారంభం నుంచి పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.


ఆగిపోయిన షెడ్ నిర్మాణం


చీనీ కుప్పలను వరిగడ్డితో కప్పిన దృశ్యం

బిల్లు రాకపోవడమే కారణమా?

షెడ్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు కాకపోవడంతోనే పనులు ఆపేసినట్లు సమాచారం. గత మూడేళ్లుగా షెడ్ నిర్మాణ పనులకు సంబంధించి ఒక్క రూపాయి కూడా కాంట్రాక్టర్ ఖాతాల్లో జమ కానట్లు తెలిసింది. ఈక్రమంలోనే పనులు నిలిపేసినట్లు తెలుస్తోంది. ఏడాది కిందట అప్పటి యార్డు కార్యదర్శి జయలక్ష్మి రూ.1.34కోట్ల బిల్లులు చెల్లింపులకు సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే బిల్లులు మాత్రం కాంట్రాక్టర్ ఖాతాలోకి జమకాని పరిస్థితి. ఈక్రమంలోనే షెడ్ నిర్మాణం పూర్తి చేయకుండా నిలిపేసినట్లు తెలుస్తోంది.


మార్కెట్‌లో అసంపూర్తిగా కనిపిస్తున్న కవర్ షెడ్

ఎండలోనే చీనీకాయలు..

చీనీ సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటింది. దిగుబడులు బాగుండటంతో ఆశించిన దానికంటే ఎక్కువగానే మార్కెట్‌కు కాయలు వస్తున్నాయి. మార్కెట్‌లో చీనీ కాయలను కుప్పలుగా పోసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాత షెడ్, కొంత పూర్తయిన షెడ్లలో కుప్పలు పోస్తున్నారు. అయితే ఆ స్థలం సరిపోవడం లేదు. దీంతో కాయలను మండుటెండలోనే కుప్పలుగా పోస్తున్నారు. కాయలు ఎండకు దెబ్బతినకుండా ఉండేందుకు వరిగడ్డిని కప్పుతున్నారు. షెడ్ నిర్మాణం పూర్తయితే ఈ అవస్థలు ఉండేవీ కాదని రైతులు, వ్యాపారులు అంటున్నారు. షెడ్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందోనని రైతులు, వ్యాపారులు ఎదురుచూస్తున్నారు.

బిల్లు పెండింగ్ వల్లే..

చీనీ మార్కెట్‌లో కవర్ షెడ్డు నిర్మాణ బాధ్యతలు తిరుమల కన్‌స్ట్రక్షన్ ఇచ్చారు. అయితే యార్డులోని కవర్ షెడ్ నిర్మాణంతోపాటు షాపింగ్ రూమ్‌ల నిర్మాణాలకు సంబంధించి రూ.3కోట్లు కాంట్రాక్టర్‌కు బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్ పనులు చేయకుండా నిలిపివేశాడు.

-రఘునాథ్, డీఈ, ఇంజనీరింగ్ విభాగం, మార్కెటింగ్ శాఖ

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే

ఉపేక్షించేది లేదు

అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు



అనంతపురం క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే ఉపేక్షించేది లేదనీ, చర్యలు తప్పవని అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కేశవనాయుడు స్పష్టంచేశారు. రీసర్వే, మిగులు భూములు తదితర అంశాలపై ఆర్డీఓతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ప్రశ్న: భూవివాదాల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నారు?

ఆర్డీఓ: భూముల వివాద అంశంలో ఇరువర్గాలతో మాట్లాడతాం. పట్టా భూములకు సంబంధించి డాక్యుమెంట్ ప్రకారం విచారించి, అర్హులకు న్యాయం చేస్తున్నాం. అసైన్డ్‌భూముల్లో సాగులో ఎవరున్నారనేది పరిశీలిస్తాం. డాక్యుమెంట్ ప్రకారం క్షేత్రస్థాయిలో లేనివారికి నోటీసులిస్తున్నాం.

ప్రశ్న: రీసర్వే ఎంతవరకు వచ్చింది?

ఆర్డీఓ: ప్రస్తుతం మండలానికో గ్రామం పైలెట్‌గా తీసుకుని, రీసర్వే చేస్తున్నాం. తర్వాత మిగిలిన గ్రామాల్లోనూ చేపడతాం. రీసర్వేలో ప్రధానంగా వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్ భూముల వివాదంపైనే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. గతంలో జరిగిన పొరబాట్ల కారణంగా వెబ్‌ల్యాండ్ ఫైల్స్ వస్తున్నాయి. వాటిలోనూ కొన్ని కేసులు పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: పుట్లూరులో సోలార్ కోసం ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారా..?

ఆర్డీఓ: పుట్లూరు మండలంలో సోలార్ కోసం 124 ఎకరాలు తీసుకున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై సర్వేచేసి విచారణ చేయించాం. అందులో 6.6 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నట్లు తేలింది. సంబంధిత వ్యక్తులకు నోటీసులిచ్చాం. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మిగులు భూముల పరిస్థితి ఏంటి?

ఆర్డీఓ: డివిజన్ పరిధిలో మా పరిశీలనలో పుట్లూరు, యల్లనూరు మండలాల్లో మిగులు భూములు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఎవరైనా సంబంధిత పత్రాలతో వస్తే వాటిని పరిశీలించి, జేసీకి పంపుతాం. పట్టా భూములకు డాక్యుమెంట్లు కీలకమవుతాయి.

ప్రశ్న: మిగులు భూముల విషయంలో కిందిస్థాయి నుంచి నివేదిక సరిగా ఉండటం లేదనే విమర్శ ఉంది..?

ఆర్డీఓ: అలాంటిదేమీ లేదు. ఇప్పటివరకు అనంతపురం డివిజన్ పరిధిలో దాదాపు 40 నుంచి 50 ఎకరాల మిగులు భూమికి సంబంధించి 15 కేసుల వరకు పరిష్కారం చూపాం. తహసీల్దార్ కార్యాలయాల నుంచి వాటి ఫైల్ రాగానే.. సమగ్రంగా పరిశీలించి కలెక్టరేట్‌కు పంపుతున్నాం. డాక్యుమెంట్లు సరిగా పొందుపరచాల్సి ఉంటుంది.

ప్రశ్న: ల్యాండ్ కన్వర్షన్ ఇతర ఫైళ్ల విషయంలో డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ఎలా స్పందిస్తారు...?

ఆర్డీఓ: ల్యాండ్ కన్వర్షన్‌కు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేస్తున్నారు. ఏ ఫైల్ విషయంలోనూ డబ్బు వసూలు చేయడం లేదు. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

అప్పుల ఉరికి రైతు బలి


రవి యాదవ్ (ఫైల్)

విడపనకల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో వి. కొత్తకోట గ్రామానికి చెందిన రైతు రవి యదవ్(27)లు బుధవారం ఆత్మ హత్య చేసుకున్నాడు. విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపిన మేరకు వి. కొత్తకోట గ్రామానికి చెందిన రవి యాదవ్ తన 8 ఎకరాల పొలంతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. పంట పండక, గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయాడు. ఇదే విషయాన్ని తల్లి ప్రమీలమ్మ వద్ద చెప్పి మథనపడేవాడు. పంట సాగు కోసం చేసిన అప్పులు దాదాపుగా రూ.8లక్షలకు చేరాయి. వాటికి వడ్డీలు పెరిగి పోవటం, అప్పు తీర్చే మార్గం కానరాకపోవడంతో బుధవారం తెల్లవారు జామున ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. తెల్లారినా కొడుకు తన గదిలో నుంచి ఎంత సేపటికి బయటకు రాక పోవటంతో అనుమానం వచ్చిన తల్లి ప్రమీల గది తలుపులు తెరిచి చూసింది. విగతజీవిగా ఉరికి వేలాడుతున్న కుమారుడు కనిపించడంతో బోరున విలపించింది. విడపనకల్లు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. కాగా మృతుడు రవికి ఇంకా వివాహం కాలేదు. ఈయన తండ్రి గోవిందు కొన్నేళ్ల కిందటే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి ప్రమీల, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తెను పెంచి పెద్ద వాళ్లను చేసింది. పెద్ద కుమారుడుకి, కూతురికి వివాహాలు చేసింది. పెద్ద కుమారుడు ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటుండగా వి.కొత్తకోటలో తల్లి చిన్న కుమారుడు మాత్రమే ఉండేవారు అని స్థానికులు తెలిపారు.

సారోళ్లు ఎప్పుడొస్తారో..?

● గ్రామాల్లో సచివాలయాలు వెలవెల ● పర్యవేక్షణ అంతంత మాత్రమే ● ప్రజలకు తప్పని ఎదురుచూపులు

బొమ్మనహాళ్, మే 14(ఆంధ్రజ్యోతి): నిత్యం గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సచివాలయ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి నెలకొంది. బొమ్మనహాళ్ మండలంలోని గ్రామ సచివాలయాలు మొక్కుబడిగా నడుస్తున్నాయి. వాటిలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. సమయ పాలన పాటించడం లేదు. వివిధ పేర్లతో విధులకు డుమ్మా కొడుతున్నారు. బుధవారం మండలంలోని దర్గాహొన్నూరు, కల్లదేవనహళ్లి, దేవగిరి గ్రామాల్లోని సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసిన సందర్భంగా కనిపించిన దృశ్యాలే ఇందుకు నిదర్శనం. ఒక్కో సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీ పర్యవేక్షణలో రెవెన్యూ, సర్వేయర్, సంక్షేమ, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్యుత్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇలా పలుశాఖల సిబ్బందిని నియమించారు. వారి పనితీరు, పర్యవేక్షణ అంతా గందరగోళంగా ఉంది. ఉదయం 10.30 గంటలకు దర్గాహొన్నూరు గ్రామ సచివాలయం-2కు వెళ్లగా.. వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. తర్వాత మహిళా పోలీసు వచ్చారు. గ్రామంలోని సచివాలయం-1కు 11 గంటలకు వెళ్లగా.. అక్కడ మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. సెక్రటరీ ఎక్కడ అని వారిని విచారిస్తే మండల కేంద్రానికి వెళ్లారని సమాధానం ఇచ్చారు. మండల కేంద్రానికి వెళ్లకుండా బుధవారం విధులకు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. గోవిందవాడ సచివాలయం-2కు మధ్యాహ్నం 12 గంటలకు వెళ్లగా.. ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో, వెటర్నరి అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగతా సిబ్బందిపై ఆరాతీస్తే సమాధానం రాలేదు. దేవగిరి గ్రామ సచివాలయానికి మధ్యాహ్నం 12.30 గంటలకు వెళితే అక్కడ సిబ్బంది ఎవరూ లేరు. వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు కనిపించారు. కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఉదయం 10 గంటల నుంచి ఎదురు చూస్తున్నామని, అధికారులు ఎవరూ రాలేదని అక్కడ ఉన్న మీనాక్షమ్మ, శ్రీరాములు, లేపాక్షి తెలిపారు. ఆంధ్రజ్యోతి విజిట్‌తో గ్రామ సచివాలయ విధులకు సిబ్బంది సరిగ్గా రావడం లేదని వారి బాగోతం బయటపడింది. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డుల కోసం నిత్యం గ్రామీణులు వస్తున్నారు. సిబ్బంది సరిగా రాలేదని, సమయపాలన అసలే లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



దేవగిరిలో ఖాళీగా కనిపిస్తున్న సిబ్బంది కుర్చీలు, పనులు కోసం వచ్చిన స్థానికులు

ఇన్‌సర్వీస్ టీచర్లకు అన్యాయం చేయొద్దు

● డీఈఓకు సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, మే 14(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఇన్ సర్వీస్ టీచర్లకు అన్యాయం జరక్కుండా చూడాలని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈఓను కోరారు. శారదా స్కూల్‌లో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు, ఇన్ సర్వీసు టీచర్లు డీఈఓ ప్రసాద్‌బాబును బుధవారం కలిశారు. ఉమ్మడి జిల్లాలోని జడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులు చాలామంది ఇన్‌సర్వీస్ బీఈడీ చేస్తున్నారని తెలిపారు. బదిలీల సమయంలో వాళ్లు పనిచేసే స్థానాలను క్లియర్ వేకెన్సీలుగా చూపడం సరికాదన్నారు. దీని వల్ల ఆ ఉపాధ్యాయలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎనిమిదేళ్లు పూర్తయిన వారికి, రేషనలైజేషన్‌కు గురైన వారికి ప్రస్తుత బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమణారెడ్డి, రామాంజినేయులు, లింగమయ్య, సురేష్ కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రేపట్నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్/ధర్మవరం మే14(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో యువతకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తున్నామని పినాక ప్రజా సాధికార ట్రస్టు తెలిపింది. ఈ నెల 16 నుంచి జూన్ 5 వరకు 21 రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజనం, దూర ప్రాంత విద్యార్థులకు వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. **శ్రీసత్యసాయి జిల్లావారికి ధర్మవరం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశపురంలో ఉన్న యశోద స్కూల్‌లో శిక్షణ ఇస్తారని పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఉచిత** రిజిస్ట్రేషన్ కోసం 9182776002 నంబరులో సంప్రదించాలని సూచించారు. అనంతపురం జిల్లావారికి అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న రాజహంస గెస్‌హౌస్‌లోని జిల్లా కురుబ సంఘం కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. రిజిస్ట్రేషన్ కోసం 7337523013 నంబరులో సంప్రదించాలని సూచించారు. **శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం 9గంటల సాయంత్రం 5గంటల వరకు ఉంటాయని తెలిపారు.**

ఎందుకంటే..

ప్రపంచ అనుసంధానకర్తగా ఆంగ్ల భాష ముఖ్య భూమిక పోషిస్తోంది. పరస్పరం విజ్ఞానాన్ని పంచుకోవాలన్నా, నూతన విషయాలను తెలుసుకోవాలన్నా, అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నా ఇంగ్లిష్ నేర్చుకోవాల్సిందే. అందుకే డిగ్రీ, పీజీ, బీటెక్ విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణా తగతులు నిర్వహిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్‌తోపాటు కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులపైనా ఉచితంగా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వీటిపై పట్టులేక అనేక మంది విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్ మొదలగు పోటీ పరీక్షల్లో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఐఆర్ఎస్ బి.యాదగిరి, పినాక సంస్థను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఆంత్రాక్స్‌తో గొర్రెల మృతి

కూడేరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో ఆంత్రాక్స్ వ్యాధి బయటపడింది. గత వారం రోజులుగా ఆంత్రాక్స్ వ్యాధితో 10 వరకూ మూగజీవాలు మృతి చెందడం కలకలం రేపుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంత్రాక్స్ వ్యాధి బయటపడటంతో పశు వైద్యులు అప్రమత్తమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మూగ జీవాలు ఆరోగ్యంపై సచివాలయ సిబ్బంది ఆరా తీయాలని పశు వైద్యాధికారి శ్రీనివాసులు ఆదేశించారు. ఎక్కడైన వ్యాధులతో మూగ జీవాలు బాధపడుతుంటే తక్షణం చికిత్స అందించాలని తెలిపారు. ఆంత్రాక్స్ వ్యాధి సోకిన మూగ జీవాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా కాల్చడం, లేక పూడ్చడం చేయాలని, వ్యాధి సోకిన వాటిని తింటే రోగాలు వస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సర్ ఆర్థర్ కాటన్ (జయంతి)



బ్రిటీష్ సైనికాధికారి, జనరల్ సర్ ఆర్థర్ థామస్ కాటన్ 1803 మే 15న జన్మించారు. ఇరిగేషన్ ఇంజనీర్‌గా నీటిపారుదలశాఖకు అనుబంధంగా కాలువలు, బ్రిడ్జ్‌లు నిర్మించారు. ఈస్ట్ ఇండియా కంపెనీలో మద్రాస్‌లో చేరి ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరికి అనుబంధంగా ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి లక్షలాది ఎకరాలకు గోదావరి నీరు అందేలా చేసి 'కాటన్ దొర'గా నేటికీ పిలవబడుతున్నారు. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్ట నిర్మాణం ఆయన ప్రోద్బలంతోనే నిర్మించారు. ఆయన స్మారకార్థం ప్రభుత్వం మ్యూజియం ఏర్పాటు చేసింది. 1899 జూలై 24న కన్నుమూశారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ రోడ్డుకు అనుబంధంగా ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు.

వింజమూరి శివరామరావు (జయంతి)




వింజమూరి శివరామరావు 1908 మే 15న పిఠాపురం తాలూకా చంద్రపాళెంలో జన్మించారు. అభ్యుదయ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆయన మేనమామ. కలంపేరు 'గౌతమి'. పద్యాలను, గేయాలను సమప్రతిభతో రాయగల నేర్పరి. ఆకాశవాణిలో రెండు దశాబ్దాలపాటు స్క్రిప్ట్ రైటరుగా పని చేశారు. లలితగీతాలు, రూపకాలను రాసి ప్రసారం చేశారు. 600 రేడియో నాటికలు రాశారు. 'కల్పవల్లి' ఖండకావ్య సంపుటి ఎంతో పేరొందింది. అనువాద రచనలోనూ సమర్థులు. 1982లో కన్నుమూశారు.

భైరాన్‌సింగ్ షెకావత్ (వర్ధంతి)



దేశ 11వ ఉపరాష్ట్రపతిగా వ్యవహరించిన 'పద్మభూషణ్' గ్రహీత భైరాన్‌సింగ్ షెకావత్ 1925 అక్టోబరు 23న రాజస్థాన్ రాష్ట్రంలో జన్మించారు. బీజేపీలో కీలక నేత. రాజస్థాన్‌కు 1977 నుంచి మూడు సార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. 2002 నుంచి 2007వరకు ఉపరాష్ట్రపతిగా కొనసాగారు. తొలుత సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొంతకాలం పనిచేశాక పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. ఎమ్మెల్యేగా, ప్రతిపక్షనేతగా, రాజ్యసభ సభ్యుడిగా, ముఖ్యమంత్రిగా, అత్యున్నత ఉపరాష్ట్రపతి ఇలా వివిధ హోదాలలో కొనసాగారు. పేదరిక నిర్మూలనకోసం ఉద్దేశించిన 'అంత్యోదయ పథకం' ఆయన హయాంలో ప్రవేశపెట్టినదే. 2010 మే 15న కన్నుమూశారు.

నగ్నముని (పుట్టినరోజు)



'నగ్నముని' అసలు పేరు మానేపల్లి హృషీకేశవరావు. గుంటూరు జిల్లా తెనాలిలో 1940 మే 15న జన్మించారు. 1958 నుంచి 1998 వరకు 40ఏళ్లపాటు అసెంబ్లీలో అవిచ్ఛిన్నంగా వివిధ ఉన్నత పదవులను నిర్వహించిన ఏకైక ఉద్యోగి హృషీకేశవరావు మాత్రమే. దీర్ఘ కవితలు, జమ్మిచెట్టు, అద్వైత రాజ్యం తదితర రచనలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. చెరబండరాజు, మహాస్వప్న, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, భైరవయ్యలతో పాటు నగ్నముని సహా ఆరుగురు కవులు సాహితీ చరిత్రలో దిగంబర కవులుగా పేరొందారు. నటుడు, నాటకకర్త, ప్రయోక్తగా వ్యవహరించారు. 'కొయ్యగుర్రం' రచన మహాకావ్యంగా పేరొంది ఆంగ్ల, హిందీ, పంజాబీ, కన్నడ, తమిళ, రష్యన్ భాషలలోకి అనువాదమైంది. 'కళారత్న' పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు.

మాధురి దీక్షిత్ (పుట్టినరోజు)



ప్రముఖ హిందీ నటి, 'పద్మశ్రీ' గ్రహీత మాధురి దీక్షిత్ 1967 మే 15న ముంబైలో మరాఠీ కుటుంబంలో జన్మించారు. వెండి తెరపై నటిగానే కాక సినీ నిర్మాత, బుల్లి తెర పర్సనాలిటీగా రాణిం చారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటీ మణులలో ఒకరిగా నిలిచారు. 4 సార్లు ఉత్తమనటిగా నిలిచారు. 17సార్లు నామినేట్ కాగా 6 ఫిల్మ్‌ఫేర్ ఇతర పురస్కారాలు అందుకున్నారు. డ్యాన్స్ తదితర పలు కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అంతేకాక 'యునిసెఫ్' తరపున బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థపై పోరాటం చేశారు. ప్రొడక్షన్ కంపెనీ ఆర్ఎన్ఎం మూవింగ్ పిక్చర్స్ సహ సంస్థాకురాలు.

ఆండీ ముర్రే (పుట్టినరోజు)



బ్రిటీష్‌కు చెందిన టెన్నిస్ క్రీడాకారుడు 'సర్' ఆండీ బారెన్ ముర్రే 1987 మే 15న జన్మించారు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)చే 41 వారాలపాటు వరల్డ్ నెంబరు 1గా నిలిచారు. 2016 రియో ఒలింపిక్స్‌లో రెండు గోల్డ్ మెడల్స్ ఇన్ సింగిల్స్ గెలుపొందారు. 3 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ సాధించగా ఇందులో రెండు వింబుల్డన్ పతకాలు ఉన్నాయి. ఇంతవరకు 46 ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ సాధించగా ఇందులో 14 ఏటీపీ మాస్టర్స్ 1000 ఈవెంట్స్' ఉన్నాయి. పలు చారిటీ కార్యక్రమాలకుగాను 2014లో ఆర్థర్ ఆశె హ్యుమానిటేరియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు. 2022 వింబుల్డెన్ ఫైనల్స్‌లో నోవక్ డిజోకోవిక్‌ను ఎదుర్కొన్నారు. 2022లో థర్డ్‌క్లాస్ ఆఫ్ 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' ఆఫ్ ఉక్రెయిన్‌ను గౌరవం అందుకున్నారు.

వైభవంగా శ్రీరామ సప్తాహం

శిడ్లఘట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బళువనహళ్ళి గ్రామంలో 60వ వార్షిక శ్రీరామ సప్తాహం పురస్కరించుకుని కల్యాణ సామ్రాజ్యోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించింది. తొలుత శ్రీరామ ఆలయంలో విశేష హోమాదికాలు, పుష్పాలంకరణ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై కొలువుదీర్చి శ్రీరామనామ నినాదాలతో పురవీధులలో కొనసాగింది. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, సీకల్ ఆనందగౌడ తదితరులు విశేషపూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ప్రముఖుడు సీవీ లోకేశ్‌గౌడ నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగాయి. ఉత్సవంలో జేడీఎస్ నాయకుడు తాదూరు రఘు, బీజేపీ మహిళా మోర్చా తాలూకా అధ్యక్షురాలు చాతుర్య తదితరులు పాల్గొన్నారు.



పురవీధుల్లో ఉత్సవం

విద్యార్థులకు వేసవి శిక్షణ



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

దొమ్మసంద్ర, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఎస్‌కే గురుకుల ఆధ్వర్యంలో గాంధారి విద్య పేరిట మెదడును చురుకు పరిచే శిబిరాన్ని ఆనేకల్ పట్టణం తళి రోడ్డులోని కాశివిశ్వనాథ కల్యాణమండపంలో నిర్వహించారు. మూడు రోజులపాటు సాగిన శిబిరంలో 30కుపైగా విద్యార్థులు పాల్గొన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసుకున్న విద్యార్థులకు ప్రమాణపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. శిబిరం గురువు మనోహర్ మాట్లాడుతూ గాంధారి విద్య వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుందని తద్వారా జీవనం మెరుగవుతుందన్నారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థి తల్లి గీతా మాట్లాడుతూ మూడు రోజులపాటు శిబిరంలో యోగా, ధ్యానం, జపం వంటివి నేర్పించారన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రతి విద్యార్థి తప్పక నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

వైభవంగా కరగ మహోత్సవం



బంగారపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాయస్వామి, ద్రౌప దమ్మ పూలకరగ మహోత్సవం బుధ వారం రాత్రి వైభవంగా జరిగింది. ఆల య అభివృద్ధి ట్రస్టు, తిగళ యువజన క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 79వ వార్షిక పూలకరగ ఉత్సవం జరిగింది. పూజారి బేతమంగల కృష్ణమూర్తి కరగను ధరించి పురవీధులలో ఊరేగారు. అంతకుముందు దేవాలయం సమీపంలోని వేదికపై నృత్యం చేయగా భక్తులను అలరించారు. పట్టణ వ్యాప్తంగా జాతర సంబరం నెలకొంది. కాగా గురువారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం జరగనుంది. ఉత్సవంలో ఎమ్మెల్యే నారాయణ స్వామి, మాజీ ఎంపీ ఎస్ ముని స్వామి, పురసభ అధ్యక్షుడు గోవింద, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూసీఐ నిరసన

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరలు నియంత్రించాలని, ప్రజలందరికీ మెరుగైన విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరుతూ ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నగరంలోని ఫ్రీడంపార్కులో బుధవారం రాష్ట్రస్థాయి జన పోరాట పేరిట నిరసన తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పనిరోజులను 200కు పెంచాలన్నారు. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్య కర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.



ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో నిరసన

దేవసంద్రలో ఉచిత వైద్య శిబిరం

మహదేవపుర, మే 14 (ఆంధ్రజ్యోతి): కేపీసీసీ ప్రధాన కార్యదర్శి డీకే మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఉచిత ఆరోగ్యశిబిరం నిర్వహించారు. దేవసంద్రలోని ఇంట్లో పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలపగా ఇదే సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు వందలాదిమంది పాల్గొని స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీకే మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఎన్నో మార్పులు చూశానని, పార్టీ ఎంతో బలోపేతమైందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీకే దేవేంద్ర, మేడహళ్ళి రాఖి, నితిన్ మోహన్, చెన్నకేశవులు, డీకే రమేశ్, హూరమావు ప్రసన్న, సీ వెంకటేశ్, అగర ప్రకాశ్, ఈరేగౌడ, శ్రీనివాస్ సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో అభిమానులు

సీబీఎస్ఈలో లలిత్‌క్యాసెల్ విద్యార్థుల ప్రతిభ

బెంగళూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఎస్ఎస్ఎల్ ఫలితాలలో నగరంలోని హెచ్‌వీహళ్ళి మెయిన్‌రోడ్డు రాజరాజేశ్వరినగర్‌లోని లలిత్‌క్యాసెల్ ఇంటర్నేషనల్ విద్యార్థులు రాణించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సమక్షంలో బుధవారం ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. మాహిసింగ్ 92.2 శాతం, సాయిరాం ఎస్‌డీ 85.4శాతం, వైష్ణవి 83.2శాతం, ప్రణవ్ పీ దేశ్‌పాండే 81.4 శాతం, జయేశ్‌భండారి 80.8శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ మార్కులు సాధిం చి 22మంది విద్యార్థులను సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బీపీ కళాశంకర్, కార్యదర్శి సవితా, డీన్ హరీశ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు తదితరులు అభినందించారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు తదితరులు

సీబీఎస్ఈ ఫలితాలలో రాణించిన నారాయణ విద్యార్థులు



విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

మహదేవపుర, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో కస్తూరినగర్ సీవీరామన్ భవన్‌లో కొనసాగుతున్న నారాయణ సెంటర్ విద్యార్థులు సత్తా చాటారు. 500 మార్కులకుగాను 495 మార్కులు సాధించిన ఎస్ వాకిన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కెవిన్‌కు 489, సాయి సుమిత్‌కు 485, అనీశ్‌కు 484, మరీన్‌కు 483, ఆశీక్‌కు 481 మార్కులు సాధించారని నారాయణ సంస్థ డైరెక్టర్ పీ సింధూర, ముఖ్యులు ఈదరా ఉమామహేశ్వర్‌రామ్ లు తెలిపారు. టాపర్ విద్యార్థులను సత్కరించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఏజీఎం శ్రీనివాస్, అమర్, గోపి, అనీల్, హరీశ్, ప్రిన్సిపాల్ నాగూర్‌వలి, పున్నరావ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చూసిన కనులదె భాగ్యం



చెన్నకేశవుడికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మవరం, మే 14(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పూలతో పట్టణంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవుడి పుష్పయాగం నయనానందకరంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల చివరి రోజైన బుధవారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 9గంటలకు ఉభయదాతలు శ్రీ అన్నమయ్య సేవామండలి అధ్యక్షుడు పోరాళ్ల పుల్లయ్య, భార్య పోరాళ్ల పద్మావతి, కుమారుడు పుండరీకాక్షతో కలిసి స్వామివారికి అనేక రకాల పూలను సమర్పించి, పుష్పయాగం చేయించారు. బంతి, చామంతి, పారిజాత, సంపంగి, సుగంధ, నీలాంబరి, కనకాంబరం, శ్రీకృష్ణతులసి, రామతులసి, గుండుమల్లి, సన్నజాతి, దవనం, గులాబీలతో స్వామికి పూజలు చేశారు. సహస్ర నామాలతో అన్నమయ్య సంకీర్తనలను అన్నమయ్య సేవాసమితి సభ్యులు ఆలపించారు. 6 గంటలకు శయనోత్సవం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

కురుడుమలె ఆలయంలో విశేషపూజలు



వెన్న అలంకరణలో వినాయకుడు

ముళబాగిలు, మే 14(ఆంధ్రజ్యోతి): తాలూకాలో ప్రసిద్ధిచెందిన కురుడమలె వినాయక ఆలయంలో బుధవారం స్వామివారికి వెన్న అలంకరణ నిర్వహించారు. అర్చకులు లోకనాథ్ దీక్షిత్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు కొనసాగాయి.

సీబీఎస్ఈలో రాణించిన ఏక్యా విద్యార్థులు



శ్రీలక్ష్మి



షరిక

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలలో ఏక్యా పాఠశాల విద్యార్థులు, పన్నెండో తరగతిలో సీఎంఆర్ నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రకటించారు. ఐటీపీఎల్ ఏక్యాలో 10మంది విద్యార్థులు 56 గ్రేడ్‌లను సాధించారని, 23మంది 90శాతం మార్కులతో ఉత్తీర్ణులైనట్టు ప్రకటించారు. శ్రీలక్ష్మీ నవీన్ 98.6శాతం, షరికా శ్రీజిత్ 97.8శాతం, ఆరుష్ దేశ్‌పాండే 97.2శాతం, అనుష్క 96.2శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక పన్నెండో తరగతిలో 118మంది ఉత్తీర్ణులయ్యారు. 90శాతం మార్కులతో ఆరుగురు టాపర్స్‌గా నిలిచారు. ఏక్యా బీటీఎం లేఅవుట్ స్కూల్‌లో 10మంది 23 గ్రేడ్‌ను సాధించారు. 12మంది అత్యధిక మార్కులు పొందారు. సైన్స్‌లో అంజలి విశ్వనాథ్ 97శాతం, కామర్స్‌లో లారారూత్ 90.4శాతం సాధించారు. సీఎంఆర్ ఎన్‌పీఎస్ 29మంది డిస్టింక్షన్‌లోనూ, 12మంది ఉత్తమమార్కులు సాధించినట్టు ప్రకటించారు.

రోడ్డును బాగు చేయండి



కంకరతేలిన రహదారి

చేళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): చేళూరు శివారులోని రాచెరువు నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు గల రోడ్డు కంకరతేలింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నట్టు వాహన చోదకులు, ప్రయాణీకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం అమడగూరు నుంచి ఓడీసీ మీదుగా కదిరికి వెళ్లేందుకు, హిందూపురం వెళ్లేందుకు అనుకూలంగా ఉంది. సుమారు రెండు కిలోమీటర్లపాటు రోడ్డు దుస్థితిలో ఉంది. సరిహద్దు ప్రాంతాల వారు తమ వ్యాపార పనుల నిమిత్తం ఈ మార్గంలో రాకపోకలు కొనసాగిస్తుంటారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిరుత దాడిలో దూడల మృతి

రాయచూరు, మే 14(ఆంధ్రజ్యోతి): లింగసుగూరు తాలూకా ఆనెహోసూరు సమీపంలోని నీరల్కెర వద్ద మంగళవారం రాత్రి పశువుల పై చిరుత దాడి చేసింది. చిరుత దాడిలో రెండు రెండు కోడె దూడలు మృత్యువాతపడగా మరి రెండింటికి తీవ్రంగా గాయాలైయ్యాయి. మిగితా కొన్నింటికి మాములు గాయాలు కాగా సమీపంలోని ప్రజలు భయభ్రాంతులకు గురైయ్యారు. విషయం తెలుసుకున్న అటవి శాఖ అధికారులు బుధవారం ఉదయాన్నే సంఘటన స్థళానికి చేరుకుని పశువులను పరిశీలించారు. చిరుత దాడి చేసినట్లు నిర్ధారించుకున్న అధికారులు మంగళవారం రాత్రి కురిసిన వర్షం వల్ల జాడలు కనిపించలేదని అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటు బుధవారం చాటింపు వేశారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు: కమిషనర్

అనంతపురం క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ బాలస్వామి హెచ్చరిం చారు. ఆయన బుధవారం డిప్యూటీ కమిషనర్ పావనితో కలిసి ప్లాస్టిక్ నిషేధం అంశంపై తన చాంబర్‌లో ప్లాస్టిక్ షాపుల యజమానులతో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ వస్తువుల తయా రీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. యజమానులందరికీ ఇదివరకే నోటీసులిచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం నిర్మూలించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్త్రీ చేతన అభియాన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

తోరణగల్లు, మే 14(ఆంధ్ర జ్యోతి): సండూరు తాలుకా అగ్రహాల గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్ స్త్రీ చేతన అభియాన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పనులకు వేరే ప్రాంతాలకు వెళ్లే వాళ్లమని, ఇప్పుడు ఉన్న స్థలంలోనే పనులు చేస్తూ రోజుకు 370 సంపాదిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు మడిగిన బసప్ప, రేణుక చెరస్వామి, పంచాయతీ అధ్యక్షుడు, పీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



మట్టి గంపను ఎత్తుకున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్

నేడు మడకశిర చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ
- ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

మడకశిర/టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు కమిషనర్ రంగస్వామి బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో సీఐ నాగేష్ బాబుతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం ఉదయం 11 గంటలకు మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని వివరించారు. ఇప్పటికే నగర పంచాయతీ పరిధిలోని 20 మంది కౌన్సిలర్లకు ప్రత్యేక సమావేశంపై సమాచారం ఇచ్చామని తెలిపారు. మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం లాంఛనమే అని తెలుస్తోంది. టీడీపీ తరుపున ఐదుగురు కౌన్సిలర్లు విజయం సాధించగా.. వైసీపీ నుంచి 15 మంది గెలిచారు. వైసీపీకి చెందిన ఏడుగురు టీడీపీలోకి చేరగా.. ఒక కౌన్సిలర్ అక్కడే ఉండి టీడీపీ ప్రవేశ పెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నారు. ఏడుగురు కౌన్సిలర్లు వైసీపీకి మద్దతుగా ఉన్నారు. టీడీపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లతో పాటు వైసీపీకి చెందిన 8 మంది మద్దతుతో మొత్తం 13 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధం కావడంతో పాటు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఓటు కూడా టీడీపీకి కలసి రానుండడంతో అవిశ్వాస తీర్మానంలో విజయం లాంఛనమే అన్న ప్రచారం సాగుతోంది. వైసీపీ మడకశిర నగర పంచాయతీపై పూర్తిగా ఆశలు వదిలినట్లేనని ఆ పార్టీకి చెందిన కొందరు చెబుతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.27	1,577.60
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,384	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	381	13
నీటి నిల్వ (టీఎంసీలు)	8.19	3.42

పిడుగుపాటుకు రైతు మృతి



రామన్న (ఫైల్)

బళ్లారి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు రైతు మృత్యువాత పడ్డారు. రాయచూరు జిల్లా మస్కి పామన కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల హర్వాపురం గ్రామానికి చెందిన రైతు కురుబ లింగప్ప రామన్న (38) వ్యవసాయ పనులకు పొలానికి వెళ్లారు. మంగళవారం సాయంత్రం భారీ వర్షంతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతోపాటు పిడుగు పడటంతో రామన్న అక్కడికక్కడే మృతి చెందారు. పొద్దుపోయిన తరువాత ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. వీరిని లింగ సుబ్బూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రైతు మృతి పట్ల మస్కి ఎమ్మెల్యే బసవరాజు గౌడ సంతాపం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

అడ్డపల్లకిపై ఊరేగిన స్వామీజీ



సిద్ధలింగ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

కంప్లి, మే 14(ఆంధ్రజ్యోతి): భక్తులు పార్టీ, కుల, మత వర్గాలకు అతీతంగా వుండకుండా సామాజిక సేవా కార్యక్రమాలకు సహకరించాలని, యువకులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సిద్ధలింగ శ్రీ పిలుపునిచ్చారు. బుధవారం తాలుకాలోని సోమసముద్రం గ్రామంలోని కొత్తూరుస్వామి గురు పరంపర శాఖ విరక్త మఠం పీఠాధిపతిగా నిరంజన్ దీక్ష స్వీకరించిన అనంతరం భక్తులు ఆయన్ని అడ్డపల్లకీలో ఊరేగించారు.

నేడు మత్స్యశాఖ మంత్రి రాక



మంత్రి మంకాళ

సిరుగుప్ప, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి మంకాళ ఎస్ వైద్య గురువారం సిరుగుప్ప తాలూకాలో పర్యటించనున్నారు. గురువారం తహసీల్దార్ నరసప్ప విలేకరులతో మాట్లాడుతూ తాలుకాలోని విరుపాపురం, కోహూరు క్రాస్ వద్ద అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేస్తారన్నారు. తహసీల్దార్ కార్యాలయం, అభయాంజనేయస్వామి ఆలయంలో అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనా సంబరాల సమావేశాన్ని పరిశీలిస్తారన్నారు.

మృత్యుగనులు..!

- ఇనుప గనుల్లో మరణ రోదనలు
- ఏడాదిలో 126 మంది మృత్యువాత
- లీజుదారులపై చర్యలు తీసుకోని అధికారులు



గనుల్లోంచి ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్లు

బళ్లారి, మే 14(ఆంధ్రజ్యోతి): ఇనుప గనుల్లో మృత్యు రోదనలు మిన్నంటుతున్నాయి. ఇరుకు రహదారుల్లో లారీల్లో ఖనిజాన్ని రవాణా చేస్తూ ప్రమాదాలకు గురి కావడం సర్వసాధారణంగా మారింది. గనుల్లో మైనింగ్ లీజ్ దారుల పై చట్టపర చర్యలు తప్పనిసరి. గనుల లీజ్ పొందే నాటికి స్పష్టమైన నిబంధనలు సూచిస్తూ గనుల శాఖ, అటవీశాఖ, రెవెన్యూ శాఖ ఇలా అన్ని శాఖలు అనుబంధంగా లీజ్ చట్టం రూపొందిస్తారు. లీజుదారులు నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండా గనులు తవ్వేస్తున్నారు. ఇనుప గనుల్లో ముడిఖనిజం తవ్వి టిప్పర్లలో తరలించే విషయంలో నిబంధనలు గాలికొదిలేస్తున్నారు.

- బళ్లారి, విజయనగర, చిత్రదుర్గం, తుమకూరు జిల్లాలో ఉన్న ఇనుప గనుల్లో ముడిఖనిజం రవాణా చేసే సమయంలో ఏడాదిలో 126 మంది మృతి చెందారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో అధికంగా ఇనుము ముడి ఖనిజం ఉండి తవ్వకాలు జరిపే ఈ నాలుగు జిల్లాలో కొండల్లో తవ్వకాలు జరిపి ఇనుమును వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. అలాంటి సమయంలో టిప్పర్ డ్రైవర్ల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. టిప్పర్లు కొండలో లోడింగ్ చేసుకునేందుకు అనుకూలంగా లేకపోవడం, రోడ్లు ఇరుకుగా ఉండడం పైగా కొండ అంతా ఎత్తుగా ఉండడం కారణంగా తరచూ ప్రమాదాలు తప్పడం లేదు.
- వాస్తవానికి నిబంధనల ప్రకారం గనుల్లో ఇనుము ఖనిజం తవ్వకాలు, రవాణా చేయాలంటే బాగా వెలుతురు ఉన్న సమయంలోనే చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ చీకట్లో రవాణా సాధ్యం కాదు. మంచు, వానలు కురిసే సమయంలో రవాణా సాధ్యంకాదు. కార్మికులు, ట్రక్కు డ్రైవర్లకు చీకట్లో ఇబ్బందులు తప్పవు. అయితే వెలుతురు ఏర్పాట్లపై లీజుదారులు నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. గనుల్లో ఏ చిన్న ప్రమాదం జరిగినా.. ప్రాణనష్టం సంభవించినా ఆ మైనింగ్ లీజ్‌నే రద్దు చేసే అవకాశం ఉంటుంది. కానీ అధికారులు వీటిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. వారికి అందాల్సినవి అందుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఏడాది కాలంలో ఈ నాలుగు జిల్లాలో ఉన్న ఇనుప గనుల్లో 126 మంది కార్మికులు ప్రమాదాల్లో మృతి చెందారని పోలీసు రికార్డులు తెలుపుతున్నాయి.

కండిషన్ లేని వాహనాలతోనే ప్రమాదాలు

జీవనోపాధి కోసం కొండల్లో లారీలు నడుపుకుంటూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. గనుల్లో ఎక్కువగా కండీషన్ లేని వాహనాలు, లోడర్లు, టిప్పర్లు వాడడడం వల్ల ప్రమాదం అధికంగా జరుగుతున్నాయి. వాహనాల తనిఖీలపై కూడా అధికారులు నీళ్ల వదిలేశారు. పాతవాహనాలు నడుపుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యానికి అమాయకులు బలవుతున్నారు. ఇక గనుల లీజ్ దారులు మాత్రం గనుల్లో మరణం చెందారని తెలిస్తే లీజ్‌లు రద్ద అవుతాయని, ఆసుపత్రిలోనో లేదా మర్గమద్యలోనో మరణం చెందారని తప్పుడు సమాచారం ఇచ్చి కేసు క్లోజ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని అమాయకులు ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఉంది.

దొంగ అరెస్ట్.. 30 బైక్‌ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న ఎస్పీ, పోలీసులు

బళ్లారిరూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు 30 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బళ్లారి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొద్ది రోజులుగా బైక్ చోరీలు అధికమవడంతో బళ్లారి ఎస్పీ డాక్టర్ శోభారాణి, అడిషనల్ ఎస్పీ నవీన్ కుమార్, డీఎస్పీ వెంకటేష్ మార్గదర్శకంలో ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేశారు. తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాయాపురం గ్రామానికి చెందిన ప్రహ్లద అనే వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించగా బైక్‌చోరీల వివరాలు బయట పడింది. వారి నుంచి దాదాపుగా రూ.పది లక్షల విలువచేసే 30 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐ సతీష్, ఎస్ఐ వన్నప్ప, హెడ్ కానిస్టేబుల్ ఖాజామోయిద్దీన్, శ్రీనివాస్, వీరప్ప, ప్రకాష్, రమేష్, పక్కీరప్ప, మంజునాథ, పరశురాం, చైతన్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకుపచ్చగా మారిన దరోజీ చెరువు

- కర్మాగారాల వ్యర్థాలతో కలుషితం అవుతున్న జలం

కంప్లి, మే 14(ఆంధ్రజ్యోతి): సందూరు తాలుకాలోని తోరణగల్లు గ్రామం వద్ద వుండే దరోజీ చెరువు నీళ్ల పూర్తిగా కలుషితం కావడంతో ఆకుపచ్చగా మారాయి. జిందాల్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ జలాలు కాలువల ద్వారా దరోజీ సరస్సులోకి ప్రవేశించి నీరు ఆకుపచ్చగా మారుతున్నాయి చెరువు నీటి లోని జలచరాలు చనిపోతున్నాయి. దరోజీ సరస్సు నుండి వచ్చే ఈ నీటితో వేలాది ఎకరాలు రైతులు ఆధారపడుతున్నారు. ఈ నీటిని రైతులు భూములకు ఉపయోగించుకుంటున్నారు. రైతులు ఖరీఫ్ పంటలకు నాట్లు కోసం ఇప్పటికే పొలాల్లో నారుమడులు వేసుకున్నారు. కలుషిత నీటి వల్ల పంటలు దెబ్బ తింటున్నాయి. రాబోయే రోజుల్లో వేలాది ఎకరాల భూమి బంజరు భూమిగా మారడం ఖాయం. పశువులు, గొర్రెలు, జంతువులు, పక్షులు నీటిపై ఆధారపడి వుంటాయి. పర్యావరణ అధికారులు, సరస్సు సంబంధిత అధికారులు, జిల్లా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో పోరాటం తప్పదని సీపీఎం కార్యదర్శి స్వామి అన్నారు.



వ్యర్థాలు చేరి ఆకుపచ్చగా మారిన దరోజీ చెరువు నీరు

మంత్రి కేశవ్ జన్మదిన వేడుకలు



వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

బళ్లారిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ సమీపంలో ఉన్న సూర్య ఓల్డ్ ఏజ్ హోమ్‌లో బుధవారం ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతపురం జిల్లా తెలుగు యువత జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ (విజ్జి) నేతృత్వంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ్, ప్రతాప్, వీరాంజనేయులు, భాస్కర్, అశోక్, రామాంజనేయులు, శివ, తెలుగుదేశం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ గృహవసతి: ఎమ్మెల్యే



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్

కంప్లి, మే 14(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో పేదలకు ఇంటి సౌకర్యం కల్పిస్తామని, అందరికీ గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అన్నారు. బుధవారం కుడితిని పట్టణంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు గౌతమ్ నగర్ ప్రభుత్వ భూములను ఆమె పరిశీలించారు. అనంతరం దోబీఘాట్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే నాసిరకం పనులు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించింది. త్వరలో కుడితిని పరుసభగా మారనుందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ పంచాయతీ ముఖ్య అధికారికి తెలిపారు. రాత్రివేళల్లో ఫ్యాక్టరీల ద్వారా వచ్చే దుమ్ముధూళి నుండి పట్టణంలో అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత సత్యప్ప ఉపాధ్యక్షుడు కనికేరి పంపాపతి, స్థాయి సమితి అధ్యక్షులు వి రాజశేఖర్ ముఖ్య అధికారి తీర్థప్రసాద్, పాటిల్ శారద, కౌన్సిలర్లు పట్టణ ప్రముఖులు పల్లెద ప్రభు, సత్యప్ప, కంబత్ రామాంజినప్ప, చంద్రయ్య దొడ్డ బసప్ప, చంద్రప్ప వితోబప్ప, కౌశిక్, వినోద్, రమేష్, ఆనంద్, హనుమంతు పాల్గొన్నారు.

పిడుగులతో భద్రం..!

- జాగ్రత్తలతో ప్రమాదాలకు చెక్: డీహెచ్‌ఓ రమేశ్ బాబు



బళ్లారి సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): సాధారణంగా వర్షాకాలం ముందు, వర్షాకాలంలో కనిపించే పిడుగుల పట్ల జాగ్రత్త పాటించాలని, ప్రమాదాలను నివారించడానికి ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డీహెచ్ఓ రమేశ్‌బాబు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన వారం రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో పాటు పిడుగు కారణంగా ప్రజలు మృత్యువాత పడడం బాధాకరమన్నారు. జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ జారీ చేసిన మార్గదర్శకాలు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఇచ్చిన ఆరోగ్య సలహాలను పాటించాలన్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలివీ..

- బహిరంగ ప్రదేశాల్లో చెట్ల కింద లేదా భవనాలు లేదా షెడ్లలో కాకుండా తగిన ప్రదేశంలో ఆశ్రయం పొందాలి. దీంతో ప్రాణనష్టం నివారించవచ్చు.
- ఉరుములు, మెరుపులు వస్తున్నాయని తెలిసినప్పుడు బహిరంగ ప్రదేశంలో కాకుండా ఒక లోతట్టు ప్రాంతానికి వెళ్లి కూర్చోవాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉంటే తలను మీ మోకాళ్ల మధ్య ఉంచాలి. చెట్లు వున్న ప్రాంతంలో ఉంటే అక్కడి నుంచి త్వరగా వెళ్ళిపోవడం మంచిది. మెరుపు మేఘం నుండి నేలకు ప్రవహించడానికి చెక్కవంటి తడి వస్తువును ఎంచుకుంటుంది. ఎత్తైన కొండలో ఉంటే మీరు దిగువున ఉన్న ప్రాంతానికి వెళ్లాలి.
- సరస్సులో ఈత కొట్టడం, స్నానం చేయడం చేయరాదు. విద్యుత్ స్తంభాలు విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మొదలైన వాటి దగ్గర అసలు ఉండరాదు. పిడుగులు పడే సమయంలో మొబైల్ ఫోన్లలో మాట్లాడకూడదు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండాలి. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలకు పిడుగుపాటుకు గురైన వ్యక్తులు వచ్చినపుడు తక్షణ చికిత్స చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆయన సూచించారు. అవసరమైన మందులు కూడా నిల్వ ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

సీఐ మహంతేష్‌కు ప్రశంసాపత్రం అందజేత



మహంతేష్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ శోభారాణి

బళ్లారిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని బ్రూస్‌పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహంతేష్ ఏప్రిల్ నెలలో స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల కార్యకలాపాలను కాపాడంలో పురోగతి సాధించడంలో పాటు, నీతి నిజాయితీగా పనిచేశారని ఎస్పీ శోభారాణి ప్రశంసించారు. బుధవారం ఆయన్ని ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం అందజేసిన ఎస్పీ మాట్లాడుతూ రెండు నెలల్లో అత్యంత మోటార్ సైకిల్ దొంగలను పట్టుకుని వారి నుంచి రూ.10.70 లక్షలు విలువ చేసే మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నందుకు అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు నవీన్ కుమార్, రవికుమార్, డీఎస్పీ, చంద్రకాంత్, అంజిరెడ్డి పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో డ్రీమ్ వరల్డ్ ప్రతిభ



అలైనా శ్రీషా నాగ అర్పిత్ రెడ్డి నారా కృతిక

బళ్లారి సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పది ఫలితాల్లో నగరానికి చెందిన డ్రీమ్‌వరల్డ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అనిల్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి స్కూల్ యజమాన్యం, బోధనా సిబ్బంది కృషితోనే సాధ్యమయ్యిందన్నారు. విద్యార్థులు అలైనా 97శాతం, శ్రీషా 96.80, అర్పిత్‌రెడ్డి 96.40, నారా కృతిక్ 96.40 శాతం మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ధార్మిక కార్యక్రమాలతో ప్రశాంతత: ఎంపీ



ఎంపీ తుకారామ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కంప్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రశాంతత నెలకొంటుందని ఎంపీ తుకారామ్ అన్నారు. బుధవారం కంప్లి తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలో కణివి మారెమ్మదేవి కుంభోత్సవంలో పాల్గొన్న ఆయన అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం నాయకులు మర్రిగౌడ, అంజనప్ప, ఎంపీని సన్మానించారు. కేఎస్ఎల్ స్వామి శ్రీనివాసరావు అంజనప్ప, లింగప్ప, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనం

- సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అప్పగెరె సోమశేఖర్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సోమశేఖర్

బళ్లారి సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వం, అందరికీ సమాన హక్కులు దేశానికి వెన్నముకలాంటివన్నారు. బుద్ధ -బసవ తత్వాలు అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగం కింద మనమందరం ఐక్యంగా జీవించి ఉన్నామని, కలబురగి సెంట్రల్ యూనివర్శిటీలో కన్నడ ప్రొఫెసర్ డాక్టర్ అప్పగెరె సోమశేఖర్ అన్నారు. బుధవారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఓపెన్-ఎయిడ్ థియేటర్‌లో నిర్వహించిన బుద్ధ, బసవ అంబేడ్కర్ విచారోత్సవ కార్యక్రమంలో ప్రముఖులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం బుద్ధుడు, బసవ, అంబేడ్కర్ సూత్రాలపై ఆదారపడి ఉందన్నారు. రాజ్యాంగం దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పిస్తుందన్నారు. రచయిత విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యుడు ప్రొఫెసర్ అమరేశ్ నుగడోని మాట్లాడుతూ బుద్ధుడు, బసవ, అంబేడ్కర్ ఆలోచనలు మానవ జీవితానికి కీలకమన్నారు. వారి ఆలోచనలు మనల్ని చీకటి నుంచి వెలుగులోకి నడిపిస్తాయన్నారు. బసవన్న బోధనలు, ఆయన కలిగి ఉన్న జ్ఞానం అవిష్కరణ వైపు ఒక అడుగు అని అన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఎం.మునిరాజు మాట్లాడుతూ అన్యాయానికి గురైన ప్రతి కులానికి న్యాయం జరిగాలని ఆలోచించిన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఈకార్యక్రమంలో రచయితి వెంకమ్మ, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రుద్రేశ్, శాంతనాయక్, వివిధ సంస్థల డీన్‌లు, విభాగ అధిపతులు, సమన్వయకర్తలు, పరిశోధన విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్

రేపటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు



పనులను పరిశీలిస్తున్న మేయర్ సత్య

హోసూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): హోసూరు పాత మునిసిపాలిటీ కార్యాలయం నుంచి మాలూరు, బాగలూరు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించనున్నారు. దీంతో ట్రాఫిక్‌ను మళ్ళించనున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలోని రెండు రోడ్లను ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగించుకునేలా వీలు కల్పించనున్నారు. కృష్ణగిరి జాతీయ రహదారికి వివేక్‌గార్డెన్ నుంచి బాగలూరు తమిళనాడు హౌసింగ్‌బోర్డు బాగలూరు వరకు, కేసీసీ నగర్ నుంచి చిన్నఎలసగిరి వరకు బాగలూరు జాతీయ రహదారికి ఇరువైపులా పొక్లైనర్‌లను ఉపయోగించి విస్తరణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా వైట్ మిక్స్ వేసి, ప్రత్యక్ష తనిఖీ చేసి వెంటనే పనులు పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులను మేయర్ సత్య ఆదేశించారు. జూనియర్ ఇంజనీర్ సెంథిల్‌కుమార్ ఉన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఎంఎస్ఎంఈలకు సింగిల్ విండో అనుమతులు

హోసూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని భారీ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలకోసం సింగిల్‌విండో విధానం అమలు చేస్తున్నామని ఆసక్తిగలవారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. నగరంలో బుధవారం ఏర్పాటైన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ సింగిల్ విండో పోర్టల్ వ్యవస్థ అమలు చేస్తున్నామన్నారు. ఇందులో ప్రణాళికా విభాగం, ఆహార భద్రతా విభాగం, కాలుష్య నియంత్రణ బోర్డు, తమిళనాడు, విద్యుత్ ఉత్పత్తి, రెస్క్యూ సేవల విభాగం, సిప్‌కాట్, వ్యవసాయశాఖ సహా రాష్ట్రంలోని 25కుపైగా ప్రభుత్వ విభాగాల అనుమతులను సులభంగా పొందే అవకాశం ఉందన్నారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలు ఏర్పాటు చేసుకునేవారికి ఎంతో వీలు కానుందన్నారు. హోసూరులో 2,500కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. వీటి ద్వారా 3లక్షలమందికిపైగా ఉపాధి లభిస్తోంది. సుమారు 64 ప్రధాన పరిశ్రమలు ఉన్నాయి. తమిళనాడు ప్రభుత్వ హోసూరులోని ఐటీ పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు వేసిన నేపథ్యంలో అనేక స్టార్టప్ ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలకు హోసూరు పట్ల ఆసక్తి చూపుతున్నాయి. సబ్‌కలెక్టర్ ప్రియాంక, జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ ప్రసన్న బాలమురుగన్, జాయింట్ డైరెక్టర్‌లు పచ్చయప్పన్ (వ్యవసాయం), ఇందిర (ఉద్యానవనం), అసిస్టెంట్ డైరెక్టర్ (గ్రామపరిపాలన) మహదేవన్ పాల్గొన్నారు.

తగ్గిన కొబ్బరి ధర.. రైతుల్లో నిరాశ

హోసూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): హోసూరు వారపు మార్కెట్‌కు కొబ్బరి దిగుమతులు పెరిగాయి అయితే ధరలు అకస్మాత్తుగా తగ్గడంతో రైతులలో నిరాశ నెలకొంది. హోసూరులోని ఎంజీఆర్ మార్కెట్‌లో ప్రతి బుధవారం వారపు సంత జరుగుతుంది. ఇక్కడ అన్ని రకాల కూరగాయలు, నిత్యావసర వస్తువులు విక్రయిస్తారు. ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల ప్రాంతాలనుంచి రైతులు ఇక్కడికి పెద్దసంఖ్యలో కొబ్బరి తీసుకొస్తారు. సాధారణంగా మార్కెట్‌కు 50వేల వరకు కొబ్బరికాయలు అమ్ముడవుతాయి. అయితే ప్రస్తుతం 2లక్షల దాకా కొబ్బరికాయలు వచ్చాయి. కానీ ధర ఆశించిన మేరకు లేకపోవడంతో రైతులలో నిరాశ నెలకొంది. నెలక్రితం వరకు రూ.25 నుంచి రూ.50 వరకు ఉండగా ప్రస్తుతం రూ.10 నుంచి రూ.25వరకు మాత్రమే పలికింది. కనీస ధర కోసం మరింత సమయం పడుతుందని ఎదురుచూస్తున్నామని పలువురు కొబ్బరిరైతులు అభిప్రాయపడ్డారు.



అమ్మకానికి సిద్ధంగా కొబ్బరి కాయలు